
# స్టార్ ఎట్రాక్షన్

ఆకెళ్ళ శివప్రసాద్



శుభలేఖలో వధువు, వరుడి పేరుకన్నా పెద్దగా 'మెగాస్టార్ చిరంజీవి' పేరు వేశారు. పేరు పక్కనే చిరంజీవి కలర్ ఫోటో కూడా వుంది.

మొత్తానికి బాబ్జీ అసాధ్యుడనిపించాడు. చిరంజీవి వీరాభిమానినన్న విషయం మరోసారి రుజువు చేసుకుంటున్నాడు.

మా బాబ్జీ చిరంజీవికి నికార్సయిన అభిమాని. సిన్మాలు చూడడమేకాదు, కన్పించిన వ్యక్తికల్లా కథ చెప్తాడు.

అడిగిన వాళ్ళకి అడగని వాళ్ళకి పాటలు పాడి కొండొకచో స్టెప్స్ వేసి చూపిస్తాడు. వారానికోసారైన చిరంజీవికి వుత్తరం రాస్తుంటాడు. చిరంజీవి దగ్గర్నుండి వచ్చిన జవాబులని పదిలంగా దాచేసు కుంటుంటాడు.

బాబ్జీ గదినిండా రకరకాల స్టిల్స్‌లో చిరంజీవి పోస్టర్లు న్నాయి.

'రగులుతోంది మొగలి పొదనో-'

'నడక తెలిసిన నవరాత్రనో' చిరంజీవి సిన్మా పాటలే ఎప్పుడూ హమ్ చేస్తుంటాడు.

అప్పుడప్పుడు కుర్చీల మీంచి, టేబుళ్ళ మీంచే కాక, అటకల మీద నుండి కూడా హఠాత్తుగా దూకేస్తుం టాడు.

ఆమధ్యకాలంలో-

చిరంజీవి లెవెల్లో ఛేజింగ్ చేస్తానని ఓవర్ స్పీడ్‌లో వెళ్ళాడు. ఓవర్‌స్పీడ్ వల్ల కంట్రోల్ తప్పి ఓ కూరగాయల బండిని, ఓ సోడా కొట్టుని గుద్దేశాడు.

అదృష్టవశాత్తు ప్రాణ ప్రమాదం జరగకపోయినా పోలీసుల చేతుల్లో భారీగనే అప్పచ్చులుపడ్డాయ్. దూకుడు తగ్గించుకోమని దేహశుద్ధి చేశారు.

'సిన్మాల్లో చూపినవన్నీ చేయడం కష్టంరా' అని వాడికి బోధపర్చడం ఎవరివల్ల కాలేదు.

వాడి గోల భరించలేక- మా బాబాయ్ వాడికోసం ప్రత్యేకంగా రూమ్ కట్టించాడు. ఆ రూమ్‌లో అన్నీ ధ్వంసమయిన వస్తువులే. మావాడి అభిమానం విచ్చలవిడిగా పెరిగిపోయి మావూళ్లో చిరంజీవి అభిమాన సంఘం ఏర్పాటు చేశాడు.

ఆ సంఘానికి అధ్యక్షుడు మావాడే అని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. మా బంధుకోటిని, మావూళ్ళో చాలామందిని మెంబర్లుగా చేశాడు.

తరుచు సమావేశాలు ఏర్పాటు చేస్తుంటాడు. ప్రతి నిత్యం చిరంజీవి సిన్మాల్లో పాటలు వేస్తుంటాడు.

చిరంజీవి సిన్మా హిట్టయితే పండగలా అందరికి స్వీట్లు పంచిపెడ్తాడు.

మావూరుకి దగ్గరగా చిరంజీవి సిన్మా షూటింగ్ వచ్చినప్పుడు వీడికి అభిమానంతో ఇచ్చిన ఆటోగ్రాఫ్‌ని లేమినేషన్ చేయించి పెట్టుకున్నాడు. చిరంజీవితో తీయించుకున్న ఫోటోని లైఫ్‌సైజు చేయించి పెట్టుకున్నాడు.

పొరపాటున చిరంజీవి సిన్మా ఫ్లాప్ అయితే సర్వం కోల్పోయినవాడిలా అయిపోయి, కండువాగట్రా వేసుకోకుండా విషాద గీతాలు ఆలపిస్తుంటాడు.

అంతలేసి టన్నుల టన్నుల అభిమానం వున్న మా బాబ్జీ చదవయి వుద్యోగంలో స్థిరపడినా అభిమానం వదులుకోలేదు. వీలుదొరికినప్పుడు ఏదోక రూపేణా మద్రాసు వెళ్ళి చిరంజీవిని కలిసి వస్తుంటాడు.

అలాంటి బాబ్జీ పెళ్ళికి చిరంజీవి ముఖ్యఅతిధిగా రావడం వాడి జీవితంలో బ్రహ్మాండమైన సంఘటనగా మిగిలిపోతుంది. మా అందరికి కూడా గర్వకారణమయిన విషయం అవుతుంది.

అంచేత-

ఎంత బిజీ వున్నా ఖచ్చితంగా బాబ్జీగాడి పెళ్ళికి వెళ్ళాలని నిర్ణయం తీసుకున్నాను?

ఈ సందర్భంగానైనా ప్రముఖుడితో ఫోటో తీయించుకునే అవకాశం వస్తుందన్న నాఆశ నాది!!

• • •

పెళ్ళికి రెండు రోజుల ముందే మావూరి దగ్గర చిరంజీవి సిన్మా షూటింగ్ అవుతోంది. బాబ్జీ, నేను స్వయంగా వెళ్ళి మరోసారి పెళ్ళి విషయం గుర్తు చేశాం.


చిరంజీవి సాదరంగా మా ఆహ్వానాన్ని మన్నించి హామీ ఇవ్వడం జరిగింది.

• • •

మధ్యాహ్నం పన్నెండు గంటలకే పెళ్ళిపందిరి నిండిపోయింది.

సాయంత్రం ముహూర్తం.

ఎంతమందిని పిల్చాడో తెలీదుకానీ సాయంత్రం పెళ్ళికి చిరంజీవి వస్తున్నాడనేసరికి ఎవరి కుర్చీలు




వాళ్ళు తెచ్చుకుని పెళ్ళి పందిరికి దగ్గరగా వేసేసుకున్నారు.

ఆడపెళ్ళివాళ్ళు ఎవరు పెళ్ళివాళ్ళో, ఎవరు అభిమానులో, తెలీక, గుర్తింపు పొందిన మగపెళ్ళివారికి చాటుమాటుగా మర్యాదులు చేస్తున్నారు.

మైకుల్లో చిరంజీవి సిన్మా పాటలే విన్పిస్తున్నాయ్-

అంతా గందరగోళంగా నానా యిదిగా వుంది-

మర్యాదలు జరగలేదని మగపెళ్ళివాళ్ళు పీక్కుటుంటే, ఐడెంటిటీ కార్డులు పెట్టుకోండని ఆడపెళ్ళివాళ్ళు బ్రతిమాలుతున్నారు.

ఏమిజనం! ఏమి జనం?

ఎట్టి పరిస్థితుల్లో ముహూర్తం టైంకి చిరంజీవి వస్తానని యిచ్చిన హామీ విషయం రెచ్చిపోయి బాబ్జీ ఎంతమందికి చెప్పాడో?

మా ఆవిడ గులాబీ రంగు చీర కట్టుకుందని 'ఏమే' అని అటుగా వెళ్తున్న ఆడ . మనిషిని పిలిస్తే-

'ఏంట్రా వుంచుకున్నట్టు, కట్టుకున్నట్టు పిలుస్తున్నావని' ఒకావిడ రెచ్చిపోయింది.

గులాబీచీరంటే-

'గులాబీ చీర కట్టుకున్న వాళ్ళందరు నీ పెళ్ళాలు కారు, గళ్ళ లుంగీలు కట్టుకున్న నా మొగుళ్ళు కాదని' తిట్టిన తిట్టు తిట్టకుండ తిట్టింది.

తిట్లు తిని-

మా ఆవిడే కన్పిస్తే పొరబాటులో 'ఏమండీ?' అంటే-

'ఇంతమంది ఆడాళ్ళు కన్పించేసరికి పెళ్ళాం కూడా సరిగ్గా కన్పించలేదా?' అని క్షణాల మీద అలకబూనింది మా ఆవిడ.

యిదెక్కడి గొడవరా బాబు అని నోర్మూసుకు కూర్చుంటే-

'ముంగిలా మూతి ముడుచుకున్నావే' అంటూ యింకోరు. ఎవరెవరో తెలీడం లేదు. అంతాకంగాళీగా వుంది.

ఓపక్కగా చిరంజీవిపై రాసిన పంచరత్నాలు ఎలాచదవాలో ప్రాక్టీసు చూస్తున్నాడొకాయన. పెళ్ళికొడుకు మీద రాయమంటే చిరంజీవి మీద రాశాడు.

పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు బాబ్జీ. దృష్టంతా రాబోయే చిరంజీవి మీదే వుంది. చూపులు బైటవున్నాయ్.

బ్రహ్మగారు మంత్రాలు చదువుతూ యిటువైపే చూస్తున్నారు.

దండలు గట్రా పట్టుకుని అప్పుడే, ఎప్పుడు చిరంజీవి వస్తారా అని అభిమాన సంఘం, ఇతర సభ్యులు ఎదురు చూస్తున్నారు.

అమ్మాయిని బుట్టలో తీసుకువచ్చారు.

మంత్రాలు సాగుతున్నాయ్. చిరంజీవి ఏక్షణానైనా రావొచ్చనే కబురు వచ్చింది. అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నామ్- సుముహూర్తం సమీపిస్తోంది. అక్షింతలు అందరికి యిచ్చారు. జీలకర్రా, బెల్లం వధూవరుల చేతులకి అందించారు.

సరిగ్గా- సుముహూర్తం సమయానికి-

చిరంజీవి కారు పందిరి ముందర ఆగింది-

పోలోమంటూ అంతా అటు పరిగెత్తారు-

నేను నా ఫ్రండు ఫోటో కోసం, ఆటోగ్రాఫ్ కోసం అటు పరిగెత్తాము.

జనం తోసుకుంటున్నారు. చిరంజీవి చేతులు వూపుతున్నాడు.

నన్ను తోసుకుంటూ ఓ శాల్తీ ముందుకు వెళ్తుంటే భుజం పట్టుకు వెనక్కు లాగి, ఆశ్చర్యం చూశాను-

బాబ్జీ జీలకర్రా బెల్లంతో-

''ఎంత అభిమానమైనా ఇది తరుణంరా...'' కాస్త కోపంగానే అన్నాను.

''ఏం దారుణంరా... పెళ్ళి కూతురు కూడా చిరంజీవి అభిమానట... జీలకర్ర బెల్లం పుచ్చుకుని ఈ గుంపులోకి జంప్ చేసింది. ఎక్కడుందో ఏమిటో...'' అని జీలకర్ర బెల్లం పెట్టే తల కోసం వెతికే ప్రయత్నంలో పడ్డాడు.

★